క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



జడ్చర్ల టౌన్‌: పట్టణంలోని మారుతీ నగర్‌లో ఆదివారం కేశవమాదవ ప్రేరణసమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సమితి గౌరవ అధ్యక్షుడు మంచన గుండెరావు భారతమాత చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి వెలిగించి శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో డా.మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసులు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్‌ సేవాప్రముఖ్‌ అరుణ్‌, సంయోజక్‌ లావణ్య, మెడికల్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు ముచ్చర్ల శ్రీకాంత్‌, ఆంజనేయులు, గోనెల రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మిడ్జిల్‌: మండల కేంద్రంలో వ్యాపార సంఘం నూతన కమిటీని ఆదివారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షుడు బాల్‌రెడ్డి తెలిపారు. అధ్యక్షుడిగా గంజికృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఎండి జహంగీర్‌, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు, శంకర్‌, సింహయ్య, మోహన్‌దాస్‌, నర్సింహ, కై లాస్‌, శివచందర్‌, కోశాధికారిగా బాల్‌నారాయణ, నిరంజన్‌, కార్యదర్శులుగా ప్రభాకర్‌గౌడ్‌, నారాయణ, చంద్రశేఖర్‌ తదితరులును ఎన్నుకున్నట్లు వివరించారు. మండల కేంద్రంలో ప్రతి రెండో, నాల్గో శనివారం షాప్‌లను మూసి ఉంచాలని తీర్మానించారు. బంద్‌ నుంచి మెడికల్‌, హోటల్స్‌కు సడలింపు ఇచ్చినట్లు వివరించారు. వ్యాపారులు రాజేష్‌, గంజిశేఖర్‌, లక్ష్మణ్‌, రాఘవేందర్‌, చంద్రశేఖర్‌, జహీర్‌, తదితరులు పాల్గొన్నారు.

మూసాపేటలో భారీవర్షం



అడ్డాకుల: మూసాపేట మండలంలో ఆదివారం సాయంత్రం భారీవర్షం కురిసింది. మూసాపేట, వేముల, తుంకినీపూర్‌, జానంపేట, నిజాలాపూర్‌, కొమిరెడ్డిపల్లి గ్రామాల్లో గాలులతో కూడిన వర్షం కురిసింది. పొలాల్లో వర్షం నీరు నిల్వగా .. కాల్వల్లో స్వల్పంగా వరద పారింది. అదేవిధంగా అడ్డాకుల మండలంలో కూడా వర్షం కురిసింది. ఈ క్రమంలో ఇన్ని రోజులుగా వానల కోసం ఎదురు చూస్తున్న రైతులకు ఊరట కలిగింది.

సన్మానం

కోయిల్‌కొండ: కాంగ్రెస్‌ లీగల్‌సెల్‌ కన్వీనర్‌గా నియమితులైన రాఘవేందర్‌రెడ్డిని గార్లపహాడ్‌ నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషిచేస్తున్నట్లు వివరించారు. ఆయనను సన్మానించిన వారిలో నాయకులు వెంకట్‌రెడ్డి, మల్లికార్జున్‌గౌడ్‌, గోపాల్‌, మల్లేష్‌గౌడ్‌, శ్రీహరిగౌడ్‌, రవి, ముబీన్‌, హాజీ, వెంకటయ్యగౌడ్‌, మధు తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారికి..

దేవరకద్ర: కోయిల్‌సాగర్‌ గ్రామంలోని ఆయుర్వేదిక్‌ వైద్యశాలలో గత కొన్ని సంవత్సరాలుగా పని చేసి ఆదివారం పదవీ విరమణ పొందిన డాక్టర్‌ ఎల్లయ్యను గ్రామ నాయకులు, ప్రజలు ఘనంగా సన్మానించారు. ఆయన మారుమూల గ్రామానికి వచ్చి ప్రజలకు అందించిన వైద్య సేవల గురించి పలువురు కొనియాడారు. ప్రజలకు అండగా ఉంటూ వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న ఎల్లయ్య పదవీ విరమణ పొందడం బాధకరమని అన్నారు.

భారత్‌ విజయంతో మొక్కలు నాటిన యువత



దేవరకద్ర: టీమ్‌ ఇండియా ట్వంటీ ట్వంటీ వరల్డ్‌ కప్‌లో విజయం సాధించిన సందర్భంగా ఆదివారం కౌకుంట్ల మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన యువకులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. టీమ్‌ ఇండియా విజయంపై హర్షం వ్యక్తం చేశారు. మరిన్ని చిరస్మరణీయ విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కృష్ణారెడ్డి, అభిలాష్‌, నవీన్‌, జగన్‌ , మధు, తిరుపతిరెడ్డి, విగ్నేష్‌ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

అడ్డాకుల: భూత్పూర్‌ మున్సిపాలిటీ పరిధిలో నాలుగో వార్డు ఇందిరానగర్‌ కాలనీకి చెందిన టైలర్‌ బురాన్‌ మూడురోజుల క్రితం మరణించగా.. విషయం తెలుసుకున్న కాంగ్రెస్‌ నాయకులు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కాంగ్రెస్‌ పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్‌ గౌడ్‌ రూ. ఐదువేలు ఆర్థికసాయం అందజేశారు. వి.శంకరయ్య, గడ్డం ఎల్లప్ప, వట్టెం రామస్వామి, జి.యాదయ్య, వి.రమేష్‌, ఖాదర్‌ బాబు, శ్రీను, మునయ్య ఉన్నారు.

ఎవరికి వారే.. యమునాతీరే..

- శాఖల మధ్య సమన్వయలోపం
- పట్టణవాసులకు తప్పని ట్రాఫిక్‌ తిప్పలు



జడ్చర్లలోని సిగ్నల్‌ గడ్డ వద్ద ట్రాఫిక్‌ జాం (ఫైల్‌)

జడ్చర్ల టౌన్‌: ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా మారింది జడ్చర్లలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారుల తీరు. ఆయా శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా పట్టణ ప్రజలు అవస్థలు పడుతున్నారు. నిత్యం ట్రాఫిక్‌ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలో నెలకొన్న ప్రధాన సమస్యపై సమీక్షలు జరిపేందుకు ప్రధాన శాఖల అధికారులకు సమయం చిక్కటం లేదు. సమస్య వస్తే కేవలం పోలీసులు స్పందించి వాహన రాకపోకలను క్రమబద్ధీకరించాల్సిన దుస్థితి నెలకొంది. మిగిలిన ప్రధాన శాఖలు మాకెందుకులే అన్నట్లుగా వ్యవహరించటం విమర్శలకు తావిస్తోంది. మహబూబ్‌నగర్‌ జిల్లాలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణం ఏదైనా ఉందంటే అది జడ్చర్ల నియోజకవర్గ కేంద్రం అనే చెప్పాలి. కేంద్రంలో ఉన్న బాదేపల్లి, జడ్చర్ల, కావేరమ్మపేట గ్రామాలు ప్రధానంగా అభివృద్ధి పథంలో ఉన్నాయి. పోలేపల్లి ఫార్మా సెజ్‌ రాకతో పట్టణ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం కేవలం 40వేల జనాభా మూడు గ్రామాల్లో ఉండగా.. ఇప్పుడైతే 1.10లక్షలకు చేరుకుంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించటంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. ముఖ్యంగా నియోజకవర్గ కేంద్రం మీదుగా 44, 167వ నంబరు జాతీయరహదారులు వెళ్తున్నాయి. దీంట్లో 167వ నంబరు జాతీయరహదారి పూర్తిగా 3కి.మీ మేర పట్టణంలోనే వెళ్తుంది. దీంతో నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మరోవైపు సిగ్నల్‌గడ్డవద్ద రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. ఇలా అనేక రకాలుగా నిత్యం ట్రాఫిక్‌ సమస్యలు ఏర్పడుతూనే ఉన్నాయి.

పట్టణంలో ట్రాఫిక్‌ సమస్య అంటే కేవలం పోలీసులదే బాధ్యత అన్నట్లుగా ప్రధాన శాఖల అధికారులు భావిస్తున్నారు. మున్సిపాలిటీ, రెవెన్యూ, పోలీసు మూడు శాఖల అధికారులు సమీక్షలు నిర్వహించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సి ఉంది. మున్సిపాలిటీకి ముందు మండల పరిషత్‌ సర్వసభ్య సమావేశంలో సమస్యలు చర్చించి నిర్ణయం తీసుకునే వెసులుబాటు ఉండేది. ఇప్పుడా అవకాశం లేకపోవటంతో అధికారులు సమీక్షలకు ముందుకు రావటం లేదు. దుకాణాల ముందు సామగ్రిని ఉంచటంతో ఫుట్‌పాత్‌ ఆక్రమణకు గురవుతుంది. దీనికి తోడు దుకాణాలకు వచ్చే వాహనాలు రోడ్డుపై సగానికి పైగా ఆక్రమించి పెడుతున్నారు. ఆటోలు, కార్లు, ఇతర వాహనాలు అడ్డదిడ్డంగా రోడ్డుపైనే నిలిపి ఉంచుతున్నారు. 167వ నెంబరు జాతీయరహదారి పొడుగునా ఎక్కడా ఫుట్‌పాత్‌ కనిపించదు. అంతా ఆక్రమణలకు గురైంది. ఇక బ్యాంక్‌లు, హోటళ్లు, వైన్‌షాపుల ముందు పరిస్థితి చెప్పక్కరలేదు. వాస్తవానికి పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్‌ అధికారులు సమన్వయంతో వ్యాపారస్తులు, వాహనదారులకు అవగాహన కల్పిస్తే సగం సమస్య తీరుతుంది. ఆ దిశగా అధికారులు చొరవ చూపాల్సి ఉంది. ప్రధాన శాఖలైన మున్సిపల్‌, రెవెన్యూ, పోలీస్‌ అధికారులు ట్రాఫిక్‌ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ప్రజలు గుర్తుచేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మూడు శాఖలతో సమీక్ష నిర్వహించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ప్రత్యామ్నాయ మార్గాలపై అన్వేషణ ఏది?

వాహనాల రాకపోకలు ప్రధాన రోడ్డుపైనే కొనసాగించటం వల్ల సమస్య పెరుగుతోంది. ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉన్నా ఆధికారులు పట్టించుకోవటం లేదు. తాలూకా క్లబ్‌రోడ్డు విస్తరణకు అవకాశం ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ రోడ్డును కొంత విస్తరిస్తే వాహన రాకపోకలు పెరుగుతాయి. అదేవిధంగా బాబానగర్‌, శ్రీనివాస థియోటర్‌ ఎదురుగా నుంచి రైల్వేలైన్‌ కిందుగా గంగాపురం మార్గంవైపు వాహనాల రాకపోకలు మళ్లించేందుకు చర్యలు తీసుకోవాలి. ఈ మార్గంలో ఉన్న రోడ్డు విస్తరిస్తే సగం సమస్య తీరుతుంది. రైల్వేస్టేషన్‌ వద్ద నిర్మిస్తున్న ఆర్‌యూబీ పనులు త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటే ట్రాఫిక్‌ సమస్య సగానికిపైగా తగ్గుతుంది. ఇక క్రాస్‌రోడ్డు వద్ద ప్రతిరోజు సాయంత్రం అయ్యిందంటే చాలు ట్రాఫిక్‌ సమస్య ఉత్పన్నం అవుతుంది. అక్కడ హైదరాబాద్‌ నుంచి వచ్చే వాహనాలు బ్రిడ్జ్‌ కిందనుంచి కాకుండా బూరెడ్డిపల్లి వద్ద యూటర్న్‌ తీసుకుని బస్టాండ్‌ మీదుగా మహబూబ్‌నగర్‌ వెళ్లేలా చర్యలు తీసుకుంటే సమస్య కొంత తీరుతుంది. అవసరం అయితే క్రాస్‌రోడ్డులో ఫైఓవర్‌ నిర్మాణంచేసేలా చూడాలని పట్టణవాసులు కోరుతున్నారు.

మైసమ్మ చెంత జనజాతర



నవాబుపేట: మైసమ్మ దేవత నామస్మరణతో మండలపరిధిలోని అడవి మొత్తం మార్మోగింది. ఆదివారం అమ్మవారి ఆలయానికి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. బోనాలు, నైవేద్యాలతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేకపూజలు చేశారు. సెలవురోజు కావటంతో భక్తులు అడవిలో చెట్ల కింద సేదా తీరారు. విందులు చేసుకున్నారు.



ప్రధానకార్యదర్శిగా నవీన్‌

కోయిల్‌కొండ: నారాయణపేట జిల్లా యువజన కాంగ్రెస్‌ ప్రధాన కార్యదర్శిగా గద్దెగూడెం నవీన్‌ కుమార్‌ని రాష్ట్ర యువజన కాంగ్రెస్‌ అధ్యక్షుడు శివసేనారెడ్డి ఆధ్వర్యంలో నియమించారు. ఈ మేరకు నియోజకవర్గ సమన్వయకర్త కుంభం శివ కుమార్‌రెడ్డి చేతుల మీదుగా ఆదివారం నవీన్‌కుమార్‌ నియామకపత్రాన్ని అందుకున్నారు.

గుంతలమయంగా రోడ్డు



అడ్డాకుల: మూసాపేట మండలంలోని తుంకినీపూర్‌ నుంచి వేముల బీటీరోడ్డు వరకు ఉన్న మట్టి రోడ్డు పూర్తి అధ్వానంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు పెరగడంతో పాటు గుంతలు ఏర్పడ్డాయి. వాటిలో వర్షం నీళ్లు నిలవడం ద్వారా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. మూసాపేటలోని 44వ నంబర్‌ జాతీయ రహదారి నుంచి తుంకినీపూర్‌ వరకు బీటీరోడ్డు ఉండగా గ్రామంలోని దేవాలయం నుంచి వేముల బీటీ రోడ్డు రోడ్డు వరకు సుమారు కిలోమీటర్‌ దూరం వరకు మట్టిరోడ్డే ఉంది. ఈ రోడ్డును బాగు చేయించాలని తుంకినీపూర్‌, వేముల గ్రామల ప్రజలు కోరుతున్నారు.

నేటి నుంచి బర్హానే బాదేషా దర్గా ఉర్సు



దర్గాలోని మజార్‌షరీఫ్‌



జిల్లా కేంద్రంలోని బర్హానే బాదేషా దర్గా

- మంగళవారం గంధోత్సవం

స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: జిల్లా కేంద్రం ఎర్రకుంట సమీపంలోని బాదేషా బౌలి దగ్గర గల హజ్రత్‌ బర్హానే బాదేషా రహెమతుల్లా అలై దర్గా 254వ ఉర్సు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకొని అన్ని ఏర్పాట్లు చేసినట్లు దర్గా ముతవల్లి డాక్టర్‌ గయాజ్‌పాష ఖాద్రీ హకం షర్ఫీ తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం రాత్రి 9 గంటలకు ఫైజానే అవులియా ధార్మిక సదస్సు (సెమినార్‌) ఉంటుందని, పలువురు మతపెద్దలు పాల్గొని ధార్మిక సందేశాలు ఇస్తారని పేర్కొన్నారు. అర్ధరాత్రి ఒంటిగంటకు దర్గాలో గుస్లెషరీఫ్‌ (జలాభిషేకం) నిర్వహిస్తామని తెలిపారు. దర్గా ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన గంధోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలకు గంధోత్సవ ఊరేగింపు మక్కా మజీద్‌ నుంచి ప్రారంభమై క్లాక్‌టవర్‌, పాన్‌ చౌరస్తా, లైబ్రరీ మీదుగా దర్గా వరకు చేరుకుంటుందని, అనంతరం దర్గాలో పూలు, చాదర్లు సమర్పించి మతపెద్దలు ప్రత్యేక ఫాతేహాలు అందజేస్తామని, అదే రోజు రాత్రి 10 గంటలకు ఖవ్వాలి కార్యక్రమం ఉంటుందన్నారు. 3న జష్నే చిరాగా (దీపారాధన) వేడుకలతోపాటు కుల్‌హింద్‌ ముషాయిరా (కవి సమ్మేళనం) కార్యక్రమం, 4వ తేదీన ఉదయం 9 గంటలకు ఫాతేహా-ఖత్మే ఖురాన్‌తో దర్గా ఉర్సు వేడుకలు ముగుస్తాయని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఊరేగింపు



మహబూబ్‌నగర్‌ రూరల్‌: మహబూబ్‌నగర్‌ పట్టణంలోని 11వ వార్డు పాతపాలమూరులో వెలసిన శ్రీ ఆది దేవత శ్రీ మైసమ్మదేవి అమ్మవారి దేవస్థానం కొలిచిన వారికి కొంగు బంగారమై విరాజిల్లుతోంది. ఇంత విశిష్టత గల అమ్మవారి ఉత్సవాలు ప్రతి సంవత్సరం అత్యంత ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా మైసమ్మదేవి 180వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం సమయంలో అమ్మవారి బోనాల వేడుకలను కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అలంకరించిన బోనం కుండలను తలపై పెట్టుకొని మహిళలు వార్డులోని పురవీధుల గుండా ఊరేగింపుగా మైసమ్మ దేవాలయం వరకు తరలివచ్చారు. బ్యాండు, తప్పెట్ల వాయిద్యాలు, శివసత్తుల పూనకాల మధ్య ఈ ఊరేగింపు ముందుకు కదిలింది. అనంతరం అమ్మవారి ఆలయం చుట్టూ మహిళలు సాంప్రదాయరీతిలో ప్రదక్షిణలు చేశారు. ప్రత్యేక పూజల చేసిన అనంతరం అమ్మవారికి ప్రీతిపాత్రమైన నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైసమ్మ ఆలయాన్ని రంగురంగుల విద్యుత్‌ బల్బులు, మామిడి తోరణాలతో శోభయమానంగా అలంకరించారు.

రోడ్డు మధ్యలో విద్యుత్‌ స్తంభాలు

- చోద్యం చూస్తున్న అధికారులు



నవాబుపేటలో హనుమాన్‌ ఆలయం సమీపంలో రోడ్డుపై ఉన్న విద్యుత్‌ స్తంభాలు

నవాబుపేట: నడిరోడ్డులో విద్యుత్‌ స్తంభాలు ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలో హనుమాన్‌ ఆలయం సమీపంలో జాతీయ రహదారికి వెళ్లే ప్రధానరోడ్డులో మూడు విద్యుత్‌ స్తంభాలు రోడ్డు మధ్యలో ఉన్నాయి. వీటి ప్రమాదం పొంచి ఉన్నా సంబంధిత అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు చోద్యం చూస్తున్నారు. గ్రామాల అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా సీసీ రోడ్లు వేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా చూస్తూ చూస్తూ విద్యుత్‌ స్తంభాలను అలాగే మధ్యలో ఉంచడం విస్మయానికి గురిచేస్తోంది. కొన్నిసార్లు ప్రమాదాలు సైతం చోటుచేసుకున్నాయని అయినప్పటికీ అధికారుల్లో ఏమాత్రం చలనం లేదని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీ నెరవేర్చాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

జడ్చర్ల టౌన్‌: వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పోలె జగన్‌ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఆదివారం బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో నిర్వహించిన వ్యవసాయ కార్మికసంఘం ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల ముందు వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చినందున వెంటనే అమలు చేయాలన్నారు. అలాగే కూలీలకు ఇళ్లలేని వారికి ఇళ్ల మంజూరి చేయాలని, స్థలం ఉన్నట్లయితే ఇంటి నిర్మాణం కోసం రూ.ఐదులక్షలు ఇవ్వాలని, ఎస్సీ, ఎస్టీలయితే రూ.6లక్షలు ఇవ్వాలన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలపెండింగ్‌ డబ్బులు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో భాగంగా 14మందితో కూడిన జడ్చర్ల మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు, కార్యకర్తలు గోపెనర్సింహులు, పోలమోని వెంకటయ్య, జయరాములు, యాదయ్య, బొడ్డుపల్లి నర్సింహ్మా, మల్లేష్‌, అనసూయ, బాలమణి, మాధవిలు పాల్గొన్నారు.

శ్రీరామకాలనీలో సమస్యలన్నీ పరిష్కరిస్తాం



మట్టిరోడ్డును పరిశీలిస్తున్న మున్సిపల్‌ చైర్మన్‌ ఆనంద్‌కుమార్‌గౌడ్‌ తదితరులు

మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ: స్థానిక పదో వార్డు పరిధిలోని శ్రీరామ కాలనీలో ఆదివారం మున్సిపల్‌ చైర్మన్‌ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్‌ పర్యటించారు. ఈసందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడారు. కాగా వారు సమస్యల గురించి ఏకరువు పెట్టారు. తమ కాలనీలో అన్ని సమస్యలే ఉన్నాయని ఎవరూ పట్టించుకోవడంలేదని వాపోయారు. ఈ మేరకు కాలనీ అన్ని మట్టిరోడ్లే ఉన్నాయని, డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయలేదని స్థానికులు ఆయన ఎదుట వాపోయారు. ఎక్కడికక్కడ మురుగు గుంటలు నిండి కంపుకొడుతున్నాయన్నారు. అసలే వర్షాకాలం కావడంతో మట్టి రోడ్లన్నీ బురదమయంగా తయారయ్యాయన్నారు. ప్రధాన సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు స్పందించిన ఆయన సమస్యలన్నింటినీ సాధ్యమైనంత వరకు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌ రాణి, కాంగ్రెస్‌ నాయకుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న నాటి గురువులు, విద్యార్థులు

నవాబుపేట: మండల పరిధిలోని కారుకొండ జెడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. దాదాపు 26 ఏళ్ల తరువాత కలుసుకున్న వారు నాటి జ్ఞాపకాలు నెమరు వేసుకుని ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా (1998-99) అప్పుడు తమ పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దశరథ్‌నాయక్‌, రాజుగౌడ్‌, ఆశోక్‌, రాములు, ప్రసాద్‌, గోవింద్‌, ఖదీర్‌ తదితరులు పాల్గొన్నారు.

కొత్త మండలం అలంకారప్రాయమే

- పాలకులు మారుతున్నా.. మారని స్థితిగతులు
- కొత్త కార్యాలయాల ఏర్పాటుపై నోరు విప్పని అధికారులు



జిల్లా కేంద్రంలో ఉన్న రూరల్‌ మండల ప్రజాపరిషత్‌ కార్యాలయం

మహబూబ్‌నగర్‌ రూరల్‌: పరిపాలన సౌలభ్యం కోసం గత ప్రభుత్వం కొత్త మండలాలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగానే 2016లో మహబూబ్‌నగర్‌ రూరల్‌ కొత్త మండలం ఏర్పాటు అయింది. అంతకుముందు పాత మండల కేంద్రమైన మహబూబ్‌నగర్‌లోనే రూరల్‌ మండలం కలిసి ఉండేది. అయితే రూరల్‌ కొత్త మండలం ఏర్పాటు అయ్యాక ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకేచోట విధిగా ఉండాలి. మండల ప్రజాపరిషత్‌ కార్యాలయం, తహసీల్దార్‌ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పోలీస్టేషన్‌, మండల విద్యావనరుల కేంద్రం వంటివి కొత్త మండలంలోనే ఉండాలి. ఏళ్లు గడుస్తున్నా మండలానికి సంబంధించిన ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఇప్పటికీ పాత మహబూబ్‌నగర్‌ మండలంలోనే కొనసాగుతున్నాయి. మండల వ్యవస్థలో రెవెన్యూకు సంబంధించి తహసీల్‌ కార్యాలయం, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి మండల పరిషత్‌ కార్యాలయం, శాంతి భద్రతలకు సంబంధించి పోలీస్టేషన్‌, పాఠశాలలకు సంబంధించి విద్యా వనరుల కేంద్రాలు ఉంటాయి. వీటికి అనుబంధంగా మండల వ్యవసాయ అధికారి, మండల విద్యుత్‌ అధికారి (ఏఈ), నీటి పారుదల, పంచాయతీ రాజ్‌, తాగునీటి పర్యవేక్షణకు సంబంధించి గ్రామీణ నీటి సరఫరా విభాగం ఉంటాయి. కానీ కొత్త మండలంలో ఒక్క ప్రభుత్వ కార్యాలయం ఏర్పాటు కాలేదు. భూముల రిజిస్ట్రేషన్లు, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలు, విద్యార్థులు జిల్లా కేంద్రం సమీపంలోని బండమీదిపల్లిలో గల తహసీల్దార్‌ కార్యాలయానికి వెళ్లాల్సి వస్తోంది. సంక్షేమ పథకాలు, అభివృద్ధి, ఉపాధి వంటి పనులకు సంబంధించి మండల పరిషత్‌ కార్యాలయం ఏర్పాటు కాకపోవడంతో కొత్త మండల ప్రజలు పాత మండల కేంద్రానికే వెళ్లాల్సి వస్తోంది. కొత్త మండలం ఏర్పాటుతో పాలన తమకు దగ్గరైందని మురిసిపోయిన ప్రజలు, మండల పరిషత్‌ కార్యాలయం గానీ, తహసీల్దార్‌ కార్యాలయం కానీ ఏర్పాటు కాకపోవడంతో పాత మండల కేంద్రానికే వెళ్తున్నారు. దీంతో తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు. ఆయా శాఖల కార్యాలయాలు కొత్తమండలంలోనే ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కుర్చీలకే పరిమితమైన పాలకులు

కొత్తగా ఏర్పాటైన మహబూబ్‌నగర్‌ రూరల్‌ మండలంలో 26 గ్రామపంచాయితీలు ఉన్నాయి. కొత్త మండలం ఏర్పాటు అయితే ఆయా గ్రామాల సమస్యలన్ని పరిష్కారమవుతాయని ప్రజలు భావించారు. అయితే అలంకార ప్రాయంగానే కొత్త మండలం ఏర్పాటు జరగడంతో ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్లకోసారి జరిగే ఎన్నికల్లో గెలుపొందిన ప్రజాప్రతినిధులు అయిన ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు కుర్చీలకే పరిమితమవుతున్నారు. ఇప్పటికే ఒకే దఫా పాలకుల పదవీ కాలం ముగిసింది. జూలై 6న 2019లో జరిగిన ఎన్నికల్లో ఎంపీపీ సుధాశ్రీ, జెడ్పీటీసీ సభ్యురాలు పి.వెంకటేశ్వరమ్మలతో పాటు ఎంపీటీసీ సభ్యులుగా ఎన్నికైన పాలకుల పదవీ కాలం ముగియనుంది. అధికారులు మాత్రం కొత్త కార్యాలయాల ఏర్పాటు గురించి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇక్కడే బాగుంది.. ఇక తమకు ఎందుకులే అనే విధంగా వ్యవహరిస్తూ నోరు విప్పడం లేదు. ఇప్పటికైనా కలెక్టర్‌, స్థానిక ఎమ్మెల్యేలు స్పందించాలని అంటున్నారు. కొత్త మండలమైన మహబూబ్‌నగర్‌ రూరల్‌లో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు కు కృషిచేయాలని కోరుతున్నారు. మరీ ముఖ్యంగా రూరల్‌ మండల మండల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.